
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు సోమవారం(ఇఫ్తార్-6:37), మంగళవారం (సహెర్-4:50)
ANDHRAJYOTHY
3


నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 1 ఏప్రిల్ 2024

రాళ్లు అమ్ముకున్నరు

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో వెలికితీసిన రాళ్లు అక్రమంగా విక్రయం
- నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ల ఏర్పాటు..
- కంకర, చిప్స్ తయారు చేసి అమ్మకం
- క్రషింగ్ చేసిన కంకరను పీఆర్‌ఎల్‌ఐకే వినియోగించాలనే నిబంధన గాలికి
- పట్టించుకోని మైనింగ్ అధికారులు
- అక్రమ క్రషర్లతో పంటలు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు చేస్తే బెదిరింపులు
- రేవల్లి మండలం శానాయపల్లి కేంద్రంగా ఓ క్రషర్ ద్వారా భారీగా దోపిడీ


వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయపల్లి వద్ద ఉన్న క్రషర్ (ఫైల్)

మహబూబ్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా ఎనిమిది ప్యాకేజీల్లో టన్నెల్, కాలువల నిర్మాణాల్లో వెలికి తీసిన రాళ్లను అక్రమార్కులు అమ్ముకున్నారు. నిరంతర పర్యవేక్షణ లేకపోవడం, అప్పటి ప్రభుత్వంలో కొందరు నీటిపారుదల శాఖ అధికారులు.. నాయకులతో దగ్గరగా ఉండటంతో అక్రమ పద్ధతిలో రాళ్లను తరలించారు. ఫలితంగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన క్రషర్లలో ఆ రాళ్లను గ్రేడ్‌ల వారీగా కంకర, చిప్స్‌గా క్రషింగ్ చేసి.. బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారు. పీఆర్‌ఎల్‌ఐలో వెలికితీసిన రాళ్లను అమ్ముకుంటున్నారని ప్రభుత్వానికి తాజాగా ఫిర్యాదులు రావడంతో.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. 2021 నుంచే ఈ రాళ్ల తరలింపు, క్రషర్లపై రైతులు ఫిర్యాదు చేసినా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. పైగా సదరు రైతులను క్రషర్ యజమానులు, ఇతర ప్రైవేటు వ్యక్తుల ద్వారా బెదిరించిన దాఖలాలు ఉన్నాయి.

అనుమతులు లేని క్రషర్లు..

వెలికితీసిన రాళ్లను గ్రేడ్‌ల వారీగా కంకరగా మార్చి.. తిరిగి ప్రాజెక్టుల్లో టన్నెళ్లు, కాలువల సీసీ లైనింగ్ పనుల్లోనే వినియోగించాలనే నిబంధన ఉంది. కానీ కొంత మంది ప్రజాప్రతినిధుల సహకారంతో అనుమతులు లేకుండా క్రషర్లను ఏర్పాటు చేసుకుని బహిరంగ మార్కెట్‌కు ఆ కంకరను తరలించారు. ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం 512.99 క్యూమెక్కుల బండరాయి వెలికితీస్తే.. ఇప్పటివరకు 79.62 లక్షల క్యూమెక్కుల రాయిని తిరిగి ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించారు. మిగతా రాయిలో కొంత భాగం ఇంకా ప్యాకేజీల వద్దనే ఉండగా.. మెజారిటీ బండరాయిని ఇప్పటికే తరలించారు. 2021 నుంచి రాయి తరలింపు, అక్రమ క్రషర్లపై ఫిర్యాదులు అందుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. పీఆర్‌ఎల్‌ఐలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ సమీపంలోని శానాయపల్లిలో కూడా రాయిని క్రషింగ్ చేయడానికి అనుమతులు లేకుండా క్రషర్‌ను ఏర్పాటు చేశారు. క్రషర్ ఏర్పాటు చేయాలంటే నిర్వాహకులు మైనింగ్, పొల్యూషన్, బ్లాస్టింగ్‌తో పాటు రెవెన్యూ నుంచి కూడా అనుమతులు తీసుకోవాలి. కానీ శానాయపల్లి వద్ద అలాంటి అనుమతులు లేకుండానే క్రషర్ ఏర్పాటు చేశారని రైతులు అప్పట్లో ఆరోపణలు చేశారు. ఈ క్రషర్ పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేయడంతో దాని నుంచి వస్తున్న డస్ట్ కారణంగా సుమారు 60 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ఇక్కడ టన్నెల్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ.. మెటల్ వినియోగం కోసం కంకరగా మార్చేందుకు మరో సంస్థకు అనుమతి ఇచ్చింది. ఇక్కడ క్రష్ చేయగా గ్రేడ్‌ల వారీగా వచ్చిన కంకరను తిరిగి కాంట్రాక్టు సంస్థకే అప్పగించాలి. కానీ సదరు క్రషర్ నిర్వాహకులు నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జరుగుతున్న ప్రభుత్వ పనులకు ఈ కంకరను తరలించి సొమ్ము చేసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరలింపు..

ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ ప్యాకేజీల వారీగా కాంట్రాక్టు సంస్థలకు పనులు అప్పగించారు. ఎత్తిపోతల పథకం కావడంతో ఎక్కువ దూరం టన్నెళ్లు, కాలువలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో మొత్తం ఎనిమిది ప్యాకేజీల్లో టన్నెల్, కాలువ నిర్మాణాల్లో భారీగా బండ రాయిని వెలికితీశారు. వీటిని 1, 3, 4, 5, 6, 7, 8, 12 ప్యాకేజీల నిర్మాణ ప్రదేశాల్లో నిల్వ చేశారు. మొత్తం 512.99 లక్షల క్యూమెక్కుల బండరాయిని బయటకు తీశారు. ఆ బండరాయి కనిపించడం లేదని, రూ.కోట్లు విలువ చేసే రాయిని అమ్ముకున్నారని ఫిర్యాదులు అందాయి. వాస్తవానికి ఈ రాళ్ల తరలింపుపై 2021 ఏప్రిల్‌లో కొంతమంది రైతుల ఫిర్యాదుతో 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'పచ్చని పొలాల్లో మైనింగ్ చిచ్చు' పేరుతో కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులు చర్యలకు ఉపక్రమించలేదు. దీనిని బట్టి రాయి తరలింపులో అధికారుల పాత్ర ఉందని తేటతెల్లమైంది. అయితే అప్పట్లో ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు కూడా ఇందులో భాగస్వాములై.. వారి వారి నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రభుత్వ పనులకు నిబంధనలకు విరుద్ధంగా కంకర, చిప్స్‌ను తరలించుకుని.. ఆ నిర్మాణాల కాంట్రాక్టర్లకు అయాచిత లబ్ధి చేకూర్చారని తెలుస్తోంది. దీనివల్లనే ఇరిగేషన్ అధికారులు కూడా పట్టనట్లుగా వ్యవహరించినట్లు సమాచారం.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

కొన్ని క్రషర్ల యాజమాన్యాలు ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై కోట్ల రూపాయల విలువ చేసే రాయిని తరలించుకుపోయాయి. పీఆర్‌ఎల్‌ఐ కాంట్రాక్టు సంస్థలకే ఇచ్చేందుకు ఏర్పాటైన క్రషర్ల నుంచి కంకరను బయటకు అక్రమంగా రవాణా చేశారు. ఇటు పీఆర్‌ఎల్‌ఐకి రాయి వల్ల లాభం జరగకపోగా.. మైనింగ్ రాయల్టీ ఇవ్వకుండా సదరు క్రషర్ నిర్వాహకులు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టు సంస్థ ఒక టన్ను రాయిని రూ.120కి క్రషర్‌కు అప్పగిస్తే.. వారు ప్రాసెస్ చేసిన తర్వాత టన్ను రూ.240కి తరలించాలి. ఇందులో ప్రాసెస్ చేసినందుకుగాను క్రషర్ నిర్వాహకులకు టన్నుపై రూ.120 వస్తుంది. అయితే అప్పట్లో ప్యాకేజీ 7లో చేపడుతున్న పనులకు కంకరను తరలిస్తున్నామని క్రషర్ నిర్వాహకులు బుకాయించారు. అయితే 'ఆంధ్రజ్యోతి' అప్పట్లో చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో ప్యాకేజీ 7లో మూడు అడిట్‌లలో ఎక్కడా కాంక్రీట్ పనులు ప్రారంభం కాలేదని రూఢీ అయ్యింది. అప్పట్లో నీటిపారుదల శాఖ అధికారులు కాంక్రీట్ పనులకు కాకుండా టన్నెల్‌లో బెడ్ వేయడానికి వాడుతున్నామని తెలిపారు. కానీ క్రషర్ నిర్వాహకులు టిప్పర్లు వెళ్లడానికి వేసిన రోడ్డుకే కంకర వాడుతున్నామనే పేరుతో చెక్‌డ్యాంలు, మార్కెట్లు, ప్రభుత్వ భవనాలు, డిండి ప్రాజెక్టులో చెక్ డ్యాంలు, రోడ్ల నిర్మాణానికి తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ప్రజాప్రతినిధుల ఆదేశాలతో కొంత మేర ప్రభుత్వ పనులకు వెళ్లగా.. మెజారిటీ భాగం మాత్రం ప్రైవేటు నిర్మాణాలకు తరలించారు. 2021 నుంచి వరుసగా ఫిర్యాదులు అందినప్పటికీ.. చర్యలు తీసుకోకపోవడం వల్ల రూ.కోట్లు విలువ చేసే రాయి పక్కదారి పట్టిందని మాత్రం చెప్పొచ్చు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టిన నేపథ్యంలో బాధ్యులను గుర్తించే అవకాశం ఉంది.


డస్ట్ పడటంతో దెబ్బతిన్న వరి (ఫైల్)

బీఎస్పీ అభ్యర్థిత్వంపై..
మల్లగుల్లాలు

- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలో మందా జగన్నాథ్ పేరు
- అలాంటి యోచన లేదన్న కాంగ్రెస్ నాయకుడు
- బీఎస్పీ పరిశీలనలో ఇంద్రకల్ కుమార్, జెట్టి ధర్మరాజు పేర్లు

నాగర్‌కర్నూల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరిన నేపథ్యంలో బహుజన సమాజ్ పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోయే అభ్యర్థి ఎవరనేది చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లు రవి, బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ తనయుడు భరత్‌ప్రసాద్ టికెట్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీఎస్పీ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలోకి దిగుతారని రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది. కానీ.. బీఎస్పీ, బీఆర్‌ఎస్ పొత్తు విషయంలో కేంద్ర స్థాయిలో చోటు చేసుకున్న పరిణామాలు ప్రవీణ్‌కుమార్‌ను బీఆర్‌ఎస్‌లో చేరేలా చేశాయి.

సందిగ్ధంలో బీఎస్పీ టికెట్

బహుజన సమాజ్ పార్టీ నుంచి కీలకంగా వ్యవహరించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరడంతో నాగర్‌కర్నూల్ బీఎస్పీ టికెట్ ఎవరికీ దక్కుతుందనే విషయంలో మీమాంస నెలకొంది. ప్రవీణ్‌కుమార్‌కు ఇంద్రకల్ కుమార్ సన్నిహితుడు. బహుజన సమాజ్ పార్టీని జిల్లాలో విస్తృత పరిచే క్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సన్నిహితుడుగా మారాడు. అతనికి బీఎస్పీ టికెట్ ఇచ్చినా పోటీ చేసే పరిస్థితి లేదు. అయితే ఇటీవలి కాలంలో బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన జెట్టి ధర్మరాజు బీఎస్పీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ టికెట్ తనకు ఇవ్వాలని పదే పదే విజ్ఞప్తి చేసిన అధిష్ఠానం ఇతమిద్ధమైన నిర్ణయం తీసుకోలేదు. మాల సామాజిక వర్గానికి చెందిన జెట్టి ధర్మరాజుకు టికెట్ ఇవ్వాలని పలు సందర్భాల్లో ఆయా పార్టీలకు విజ్ఞప్తులు వచ్చాయి. అవి ఎంత వరకు ఫలిస్తాయో ముందు జరిగే రాజకీయ పునరేకీకరణ నేపథ్యంలో తెలుస్తుంది. అయితే 15 రోజుల నుంచి మందా జగన్నాథ్ బహుజన సమాజ్ పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన ఈ అంశాన్ని తీవ్రంగా ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్నానని, రాజకీయ శత్రువులు చేసే విష ప్రచారాన్ని నమ్మవద్దని స్పష్టీకరించారు.

రేపు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్

- రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 31: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌ను మంగళవారం నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్ తెలిపారు. కౌటింగ్ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని చెప్పారు. ఈ విషయమై ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ, కౌంటింగ్ రిహార్సల్‌కు ఆయన హాజరై మాట్లాడారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ప్రాంభమవుతుందని చెప్పారు. సిబ్బంది ఉదయం 6:30 గంటల వరకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్(మహబూబ్‌నగర్), మయాంక్ మిట్టల్(నారాయణపేట్), రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు (మహబూబ్ నగర్), డీఆర్వో కేవీవీ రవికుమార్ (మహబూబ్‌నగర్), ఆర్డీవో నవీన్ (మహబూబ్‌నగర్), ఆర్డీవో వి.మాధవరావు (షాద్‌నగర్), మాస్టర్ ట్రైనర్ తరాల పరమేష్ పాల్గొన్నారు.

గెలిపించేందుకు డిసైడ్ అయ్యారు

- తనను దొరసాని అన్న సీఎం క్షమాపణ చెప్పాలి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

మహబూబ్‌నగర్, మార్చి 31: అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని డిసైడ్ అయ్యారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇన్నాళ్లు తనను దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పుకున్న ముఖ్యమంత్రి ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్త రాగం అందుకున్నారన్నారు. సొంత జిల్లాలో కాంగ్రెస్ ఓడిపోతే ఆ ఓటమిని సాకుగా చూపి తనను రాష్ట్ర వ్యాప్తంగా టార్గెట్ చేస్తారని సెంటిమెంట్ రాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పాలమూరులో కాంగ్రెస్ ఓడితే సీఎం రేవంత్ ముఖ్యమంత్రి పదవి ఊడుతుందా అని ప్రశ్నించారు. గద్వాలలో కాంగ్రెస్ సునాయాసంగా గెలిచేదని, దొరసాని వచ్చి అల్లుడికి ఓట్లు వేయించడం వల్ల ఓడిపోయామని రేవంత్ మాట్లాడటం దురదృష్టకరమని చెప్పారు. తనను దొరసాని అన్న రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీ ఇంట్లో ఆడవాళ్లను కూడా దొరసాని అంటే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వ్యక్తిగత ఆరోపణలు చేస్తే మర్యాద ఉండదని హెచ్చరించారు. మాట్లాడితే డీకే అరుణ పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు తీసుకురాలేదని అంటున్నారని, ఎంపీగా ఉన్న నువ్వు ఏం పీకినవ్?.. నువ్వెందుకు తీసుకురాలేదని నిలదీశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు తెచ్చిందే డీకే అరుణ అని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీకున్న ఓట్లు ఎన్ని?.. ఎలా గెలుస్తామని అభ్యర్థిని నిలబెట్టారని ప్రశ్నించారు. ఓటుకు నోటుతో ఓట్లేసుకునే ప్రయత్నం చేయడం వాస్తవం కాదా అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న వారందరినీ పార్టీలో చేర్చుకుంట లేరా?.. నీవు చేస్తే న్యాయం మేము చేస్తే అన్యాయమా అని నిలదీశారు. ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన మీకు ఎందుకు ఓటువేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారట అని, మరి కాంగ్రెస్ హోర్డింగ్‌లలో రాహుల్ ఫొటో, ఖర్గే ఫొటో ఎందుకు పెట్టలేదో చెప్పాలని కాంగ్రెస్ పారమెంట్ అభ్యర్థిని నిలదీశారు. కాంగ్రెస్‌కు ప్రధానమంతి అభ్యర్థే లేరని ఎద్దేవా చేశారు. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులు, పడాకుల సత్యం పాల్గొన్నారు.

● మహబూబ్ నగర్ (క్లాక్‌టవర్): ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అంశాన్ని గడప గడపకు తీసుకెళ్లాని బీజేపీ పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ పిలుపు నిచ్చారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ అధ్యక్షతన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అరుణ హాజరై మాట్లాడారు.


గుర్రంగడ్డలో ఎండిపోతున్న వరి పైరు(ఫైల్)


పంటలను కాపాడుకునేందుకు నదిలోని గుంతలో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్న రైతులు

కన్నీటి కష్టాలు

- ఎండిన కృష్ణానది
- గుర్రంగడ్డలో ప్రశ్నార్థకంగా మారిన 800 ఎకరాల్లోని వరి పంట
- జెన్‌కో నిల్వ నీటిని ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు

గద్వాల, మార్చి 31: కృష్ణానది వట్టిపోవడంతో జోగులాంబ గద్వాల జిల్లా దివి గ్రామంలోని 800 ఎకరాల వరి పంట ప్రశ్నార్థకంగా మారింది. గ్రామంలో 200 కుటుంబాలు ఉన్నాయి. అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. 1200 ఎకరాల్లో పంటలు వేస్తారు. పక్కనే ఉన్న కృష్ణానదిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని, రెండు పంటలు పండిస్తారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నది ఎండిపోయింది. మొదట నదిలో నీళ్లు ఉండటంతో గ్రామస్థులు 800 ఎకరాల్లో వరి సాగు చేశారు. రానురాను నదీలో నీళ్లు తగ్గుతూ వచ్చాయి. దీనికితోడు ఎండల తీవ్రత కారణంగా నదీలోని గుంతల్లోని నీళ్లు కూడా అడుగంటి పోయాయి. దాంతో ఇప్పటికే 200 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి.

కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం

పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. రెండు నుంచి మూడు తడుల నీళ్లు ఇస్తే పంటచేతికి అందుతుంది. దాంతో కృష్ణానదిలోని గుంతలలో ఉన్న కొద్దిపాటి నీళ్లను మోటార్లు ఏర్పాటు చేసి, పైపుల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కొక్కరు ఒకచోట నుంచి మోటారుతో నీళ్లను కొంత దూరానికి తెచ్చి, అక్కడ నుంచి మరో మోటారుతో పంటకు వేస్తున్నారు. ఇలా ఒక్కో రైతు రెండు నుంచి మూడు మోటార్లను ఉపయోగించి పంటలకు నీళ్లు పెడుతున్నారు. ఇందుకోసం మోటార్లను అద్దెకు తెచ్చుకున్నారు. పైపులు, విద్యుత్ తీగల కోసం భారీగా ఖర్చు చేస్తున్నారు. నదిలోని గుంతల్లో నీళ్లు కూడా అయిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

జెన్‌కోపైనే ఆశలు

రేకులపల్లి దగ్గర ఉన్న లోయర్ జెన్‌కోలో దాదాపు ఒక టీఎంసీ వరకు నీళ్లు ఉన్నాయి. ఇవి దేనికీ వాడుకోకుండా నిల్వ నీటిగా ఉంచారు. ఆ నీటిని నదీలోకి వదలాలని అడిగేందుకు హైదరాబాద్‌లోని జెన్‌కో సీఎండీ దగ్గరకు గుర్రంగడ్డ రైతులు వెళ్లారు. అయితే జల ఉత్పత్తికి తగినన్ని నీళ్లు లేవని సీఎండీ చేతులెత్తేశారు. టర్బన్‌ల నుంచి కాకుండా స్లూయిస్ రంధ్రాల ద్వార నీటిని వదలాలని రైతులు వేడుకున్నారు. అందుకు నిబంధనలు ఒప్పుకోవని తేల్చిచెప్పారు. 2019లో ఇలాంటి పరిస్థితిలో నీటిని వదిలారని, ఇప్పుడూ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక వస్తే పరిశీలిస్తామని సీఎండీ చెప్పడంతో రైతులు వెనుతిరిగి వచ్చారు.

కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి

మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు డీకే సమరసింహారెడ్డితో రైతులు తమగోడును వెళ్లబోసుకున్నారు. జెన్‌కో ద్వారా తాగునీటి పేరుతో ఒకరోజు నీటిని వదిలితే తాగు నీరు అందడంతో పాటు పంటలు బతుకుతాయని వేడుకున్నారు. దాంతో ఆయన కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. దీంతో కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను గ్రామానికి పంపించారు. వాళ్లు జక్కలగుంట(గ్రామానికి మంచి నీటిని అందించే సుండిగుండం)లోని నీళ్లను పరిశీలించి వేసవికి నీటి కొరత ఉండదని నివేదించారు. దాంతో పంటను కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించి తమ పంటలను కాపాడే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

రాత్రుళ్లు నిద్రలేక కాపాడుకునే ప్రయత్నం



నేను 20 ఎకరాల్లో వరి వేశా. నీళ్లు లేక ఐదు ఎకరాల్లో పంట ఎండింది. మిగిలిన పంటను కాపాడుకోడానికి ఐదు మోటార్లు అద్దెకు తెచ్చా. నదిలో కిలోమీటరు దూరంలో ఏగుంతలో నీళ్లు ఉంటే కూలీల ద్వారా అక్కడికి మోటార్లను మారుస్తూ పంటను కాపాడే ప్రతయ్నం చేస్తున్నా. రాత్రుళ్లు నిద్రకూడ పోవడం లేదు. జెన్‌కో మూడు గంటల పాటు నీళ్లు వదిలినా పంటలు బతుకుతాయి.

\- బాలకృష్ణారెడ్డి, రైతు, గుర్రంగడ్డ

8 ఎకరాల్లో పంట ఎండింది



నీళ్లు లేక ఎనిమిది ఎకరాల్లో పంట ఎండింది. పెట్టిన పెట్టుబడి పోయింది. మిగిలిన పంటను కాపాడుకోడానికి ప్రయత్నిస్తున్నా. నదిలో నీళ్లు లేవు. కలెక్టర్ చొరవ తీసుకొని మూడు గంటల పాటు జెన్‌కో నీటిని వదిలించాలి.

\- వెంకట్రామిరెడ్డి, రైతు, గుర్రంగడ్డ

రాహుల్‌గాంధీ సభను జయప్రదం చేయాలి

- సభలో ఏఐసీసీ ఐదు గ్యారెంటీల విడుదల
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 31: ఈ నెల 6న హైదరాబాదు తుక్కుగూడలో నిర్వహించ తలపెట్టిన ఏఐసీసీ జాతీయ నేత రాహుల్‌గాంధీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డితో కలిసి మల్లు రవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న తుక్కుగూడ సభకు రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరు కానున్నారని పేర్కొన్నారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేయనున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ఐదు గ్యారెంటీలను సభలో ప్రకటించనున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కూలీలు, కార్మికులకు సంబంధించి మొత్తం 25 గ్యారెంటీలను ప్రకటించనున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా రాజకీయ పునరేకీకరణ జరిగినట్లుగానే దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంతో ఏర్పడిన ఇండియా కూటమికి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏఐసీసీ ఐదు గ్యారంటీలతో పాటు రాష్ట్రంలో అమలులో ఉన్న ఆరు గ్యారెంటీలను కలుపుకుని మొత్తం 11 గ్యారెంటీలతో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఇద్దరు పార్టీలు మారి టికెట్లు తెచ్చుకున్న వారేనన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన ఎంపీ రాములు తన కుమారుడి టికెట్ తెచ్చుకున్న ఎంపీ రాములు తన హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. అలాగే తాను విమర్శించిన బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆ పార్టీతోనే స్వర్ణయుగం అనడం విడ్డూరంగా ఉందన్నారు. దళితున్ని చేస్తానన్న మోసం చేసిన కేసీఆర్ మూడెరకాల భూమి, సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీతో ఆర్‌ఎస్‌పీ ఏం చేయాలనుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టాలని ఆయన ప్రజలను కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు వల్లభ్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాస్ బహదూర్, తైలి శ్రీనివాసులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లు రవి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365


SHATTERING RECORDS అట్లుంటది మనతోని నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.15,2.30,6.00,9.15

SVC ఈశ్వర్ 70ఎంఎం - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
SVC సంగీత 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.00
SVC శివశక్తి 70ఎంఎం ఎ/సి - కాప్రా 11.15,2.30,6.15,9.30
శ్రీసాయిరాం 70ఎంఎం - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.15,9.30
గోకుల్ 70ఎంఎం ఎ/సి - ఎర్రగడ్డ 11.15,2.30,6.15,9.30

ఈనెల 5న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SVC ఈశ్వర్ 70ఎంఎం ఎ/సి - అత్తాపూర్
SVC సంగీత 70 ఎంఎం ఎ/సి - ఆర్.సి.పురం
SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్
SVC శివశక్తి 70ఎంఎం ఎ/సి - కాప్రా
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్
శ్రీసాయిరాం 70ఎంఎం - మల్కాజ్‌గిరి

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నార్సింగి
గలేరియా - పంజాగుట్ట | శాంతి శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | సినీటౌన్ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్బి నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | స్కైమాల్ - సనత్‌నగర్
జిఎస్ఎమ్ - మదీనగూడ | టివోలి - సికింద్రాబాద్
నెక్సెస్ సత్య - కాచిగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | షా ఘౌస్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్

శాంతి 70ఎంఎం - నారాయణగూడ | విజేత 70 ఎ/సి - బోరబండ
వెంకట్రామ పద్మావతి కాంప్లెక్స్ - కాచిగూడ | BR హైటెక్ - మాదాపూర్
భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి | సూపర్ 70 ఎ/సి - బాలాపూర్
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి | రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్
ప్రశాంత్ 70 - సికింద్రాబాద్ | SV సినీస్క్వేర్ - పటాన్‌చెరు
శ్రీరాములు 70 - మూసాపేట్ | శ్రీసాయిపూజా 70 ఎ/సి - సూరారం
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ | శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ
మహాలక్ష్మి 70 ఎ/సి - కొత్తపేట | శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ
భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల | స్వప్న 70 ఎ/సి - కాటేదాన్
రాజ్యలక్ష్మి 70 - ఉప్పల్ | శివరంజని 70 - ఇస్నాపూర్
కృష్ణ సినిమా - అలియాబాద్
నరకి 70ఎంఎం - అల్వాల్ | మహేశ్వరి 70 - మహేశ్వరం
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట | వెంకటసాయి 70 - కీసర
సంపూర్ణ 70 - వనస్థలిపురం | వెంకటేశ్వర 70 - గుమ్మడిదల
వైజయంతి 70 ఎ/సి - నాచారం | ఆర్తి టాకీస్ - సంఘీనగర్
సాయిరంగ 70 ఎ/సి - మియాపూర్ | శెట్టి సినిమాస్ - చౌదరిగూడ
మరియు మీ అభిమాన థియేటర్లలో

అదుపు తప్పి కారు బోల్తా

గండీడ్, మార్చి 31 : అదుపుతప్పి కారు బోల్తాపడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని మన్సూర్‌పల్లి గేటు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోయిలకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన బి.ఆంజనేయులు అనే యువకుడు కారుపై కోయిలకొండ నుంచి గండీడ్‌కు పని మీద వెళ్తున్నాడు. మన్సూర్‌పల్లి గేటు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారులో ఒక్కడే ఉన్నాడు. బెలూన్స్ ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న ఆంజనేయులుకు ప్రాణాపాయం తప్పింది అని తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

మిడ్జిల్ (మహబూబ్‌నగర్), మార్చి 31 : మహబూబ్‌నగర్ జిల్లామండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. భైరంపల్లికి చెందిన గొడుగు సిరియాల షాపులో 16 బీర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అస్రఫ్‌సుల్తాన్ తెలిపారు. మద్యం విక్రయాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది సునీల్, విష్ణువర్ధన్‌గౌడ్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బాలానగర్, మార్చి 31 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం లోని మల్లేపల్లి గ్రామ వాగు నుంచి అనుమతులు లేకుండా బాలానగర్ మండలానికి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ తిరు పాజి తెలిపారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌లు సిద్దులు, బాల స్వామి, పర్వతాలు అలాగే ట్రాక్టర్ యాజమానులు కృష్ణయ్య, శ్రీశైలం, సాయిలు లను అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పోలీసులకు అప్పగింత

మిడ్జిల్ (మహబూబ్‌నగర్), మార్చి 31 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని అయ్యవారిపల్లి శివారులోని దుందుబీవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. స్థానిక అవసరాల కోసం అధికారులు ఇసుకకు అనుమతులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇసుకను వాగులోంచి తీసి గతంలో ఇసుకను డంపు చేసిన ప్రదేశంలో పోస్తున్నారని, ఇంత జరుగుతున్నా మండల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 100కు ఫోన్‌చేస్తే పోలీసులు వాగువద్దకు చేరుకొని ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, పల్లె తిరుపతి, రైతులు ఉన్నారు.

పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాల న్యూటౌన్, మార్చి 31 : ప్రజలు ఆశీర్వదిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ స్థానికుడైనా నాపై నమ్మకం ఉంచి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసపు విషయాలను ప్రజలు దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ సుభాన్, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బాబర్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బండ్ల సాయి సాకేత్‌రెడ్డి, రామన్‌గౌడ, శ్రీధర్‌గౌడు, నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

ఈనెల 5న బ్రహ్మాండమైన విడుదల
From the Director of Dorasani



ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ | ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
GLOBAL CINEMAS LLP

ఈనెల 5న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్

ఏప్రిల్ 6న బ్రహ్మాండమైన విడుదల
సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీష్రాఫ్
నటించిన సైన్స్ ఫిక్షన్ చిత్రం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
SBK FILMS - 9849761038/9652052424

విజయవంతమైన 3వ వారం
వెండి తెరపై ఘన చరిత్ర సృష్టిస్తున్న గత చరిత్ర
బాక్సాఫీస్ దగ్గర విజయపథంగా దూసుకుపోతున్న



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15
BHUVANESHWARI PICTURES

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

\- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు


తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.





జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.



కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

- బస్టాండ్ లేక ప్రయాణికుల పాట్లు
- కరువైన తాగునీటి వసతి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

తిమ్మాజిపేట, మార్చి 31: మండల కేంద్రంలో దాదాపు పది లక్షల మేరకు వెచ్చించి బస్టాండ్ నిర్మించిన వినియోగంలో లేకపోవడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం. లక్ష్యం మరచిన పాలకుల అధికరుల తీరుపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. 2001 మే 24న అప్పటి జడ్చర్ల శాసన సభ్యుడు ఎం.చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించిన బస్టాండ్‌లోకి కొన్నాళ్ల పాటు బస్సులు వెళ్లడం జరిగింది. మూడునాళ్ల ముచ్చటగా మురిపించిన ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డు మీదనే బస్సులు ఆపుతున్నారు. ఎండలు మండుతున్నాయి.. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువై మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ పలు పంచాయతీలకు నిలయంగా, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా, రాజకీయ నాయకుల ప్రచారాలకు వేదికగా మారిన తీరును పలువురు విమర్శిస్తున్నారు.

మండుతున్న ఎండలకు ప్రయాణికులు విలవిలలాడుతూ నానా అవస్థలు పడుతున్నారు. ప్రతినిత్యం వేరే ప్రాంతాలకు వెళ్లేవారు తిరిగి వచ్చే వారు నిల్వ నీడ లేక రోడ్డు పక్కన ఉన్న హోటల్ వ్యాపార సంస్థల ముందర నిల్చుంటున్నారు. బస్టాండ్ లేకపోవడంతో ఆగిన బస్సుల్లో ఎక్కేవారు పరుగులు తీస్తూ ప్రాణాలు వదిలిన ప్రయాణికుల సంఘటనలు లేకపోలేదు. అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా తిమ్మాజిపేట పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో జడ్చర్ల ఎమ్మెల్యేగాను, కొన్నాళ్లు మంత్రిగాను పని చేసిన డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డిది ఆవంచ కాగా పదేళ్లపాటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా కొనసాగిన మర్రి జనార్దన్‌రెడ్డి నేరేళ్లపల్లి గ్రామ వాస్తవ్యులు కావడం మరో విశేషం. ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న తిమ్మాజిపేటలో ప్రయాణికుల సౌకర్యం కోసం బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడంపై పలువురు పలు విధాలుగా చర్చిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పట్టించుకోవాలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇకనైనా పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్వరలో వినియోగంలోకి తెస్తాం



తిమ్మాజిపేట మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఇటీవల పరిశీలించాం. ఆర్టీసీకి సంబంధించిన స్థలాన్ని కొలిచి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు బస్టాండ్ పునర్నిర్మాణం చేసి తాగునీటి వసతి కల్పించి త్వరలో బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం.

- దేవరాజ్, నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్



నిరుపయోగంగా ఉన్న బస్టాండ్



ఎండలో అవస్థలు పడుతూ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి



బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి. కనీస వసతులు కల్పించాలి. ప్రధాన రహదారిపై ప్రయాణికులకు వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించాలి.

- వట్టెపు వెంకటయ్య, ప్రయాణికుడు

ఇబ్బందులు దూరం చేయాలి



ప్రయాణికుల ఇబ్బందులు దూరం చేయాలి. తిమ్మాజిపేట మండల కేంద్రంలో వివిధ పనుల అవసరాల నిమిత్తం వచ్చిపోయే ప్రయాణికుల వ్యాపార సంస్థలకు వచ్చే రైతులకు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారు, అదేవిధంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్‌ను పునర్నిర్మాణం చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు దూరం చేయాలి.

- చిట్టెమ్మ, ప్రయాణికురాలు

ఎంబీ చర్చిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

- వేడుకుల్లో పాల్గొన్న డాక్టర్ మల్లు రవి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 31: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో ఆదివారం ఈస్టర్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి సమీపంలోని గుట్టమీద ఏసుక్రీస్తు శిలువ వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేవీ.పురుషోత్తం బాప్తీస్మము కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ చర్చి ఫాస్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ వేయబడిన తర్వాత మూడో రోజు మృత్యుంజయుడిగా లేచిన సందర్భంగా ఈస్టర్ పండుగను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తున్న ఎంబీ చర్చిని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లు రవి సందర్శించి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంబీ చర్చి చైర్మన్ బి.సంతోష్‌కుమార్, ఫీల్డు చైర్మన్ డాక్టర్ రెవరెండ్ కేవీ.పురుషోత్తం, బీఎస్.ఏలియా, నతనియల్, క్రైస్తవ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: మరణాన్ని జయించి సజీవుడైన దేవుడు యేసయ్య అని వార్ధం టిన్‌మెమోరియల్ ఎంబీ చర్చి పాస్టర్ రెవరెండ్ జేబీరాజ్ అన్నారు. కల్వకుర్తిలోని వార్ధం టీన్ మెమోరియల్ ఎంబీ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 5గంటల నుంచి ఈస్టర్ వేడుకలు కనుల పండుగగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జేబీరాజ్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజు సిలువపై అసువులు బాసిన ఏసు ప్రభువు మూడవ రోజు సమాధి నుంచి భక్తులకు దర్శనమిచ్చాడన్నారు. కాళ్ల చేతులకు కొట్టిన మేకులు గాయాలను చూసి గుర్తెరిగి యేసయ్య లేచి వచ్చాడని ఆనందోత్సాహాలతో జనం ఉప్పొంగిపోయారని పేర్కొన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఎంబీ చర్చికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చర్చి కమిటీ చైర్మన్ జోహర్న, వైస్ చైర్మన్ స్టీవెన్‌సన్, సెక్రటరీ రామస్వామి, జాయింట్ సెక్రటరీ జగదీశ్, ఇబ్రాయిల్, కృష్ణమూర్తి, ఇంజమూరి రాజు, సురేష్‌బాబు, నేరటి ప్రభాకర్, బొల్లె రాజు యాత్ నేరటి రవి, నందు, జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ ఎంబీ చర్చిలో శిలువ వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

నాలుగేళ్ల పరిపాలనపై కొందరు డైరెక్టర్ల అసంతృప్తి

తాడూరు, మార్చి 31 : తాడూరు పీఏసీఎస్ నాలుగు సంవత్సరాల లావాదేవీలకు సంబంధించి రికార్డులన్నీ చూపించకపోవడంపై సీఈవో ఆంజనేయులుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్మన్ మల్లెపల్లి అధ్యక్షతన 2023-24 సంవత్సరాలకు సంబంధించి వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు రాంచంద్రారెడ్డి, గిరిబాబు, కృష్ణయ్యలు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా సింగిల్ విండో కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలపై ఎందుకు సమాచారమివ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలు, ఎరువుల పంపిణీకి సంబంధించిన లావాదేవీలు, రైతుల రుణమాఫీకి సంబంధించిన వివరాలు తెలియపర్చకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో సీఈవో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం తాడూరు పీఏసీఎస్ కార్యాలయం జిల్లాలో లాభాల బాటలో నడుస్తుందని, ప్రస్తుతం సొసైటీ నుంచి బ్యాంకుకు ఎలాంటి అప్పులు లేకపోగా దాదాపు కోటి రూపాయలకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశామన్నారు. వచ్చే జనరల్ బాడీ సమావేశం వరకు పీఏసీఎస్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలపై పూర్తి వివరాలు సభ్యులకు తెలియజేస్తామని సూచించారు. పీఏసీఎస్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గందరగోళానికి సంబంధించి సభ్యులు ఇప్పటి నుంచైనా ఇన్‌చార్జి చైర్మన్, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇకపై ప్రతి సమావేశానికి ప్రతీ ఒక్క సభ్యున్ని తప్పనిసరిగా ఆహ్వానించాలని సూచించారు. మాజీ చైర్మన్ ఎండి.సమద్‌పాష, డైరెక్టర్లు యార రమేష్, శేఖర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గిరిబాబు, కృష్ణయ్య, మరికొంత మంది డైరెక్టర్లు పాల్గొన్నారు.



తాడూరు సింగిల్ విండో కార్యాలయంలో 2023-24 వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ఇన్‌చార్జ్ చైర్మన్ మల్లెపల్లి వెంకట్‌రెడి

ఘనంగా ఈదమ్మ మందాత తల్లి కల్యాణోత్సవం



ఈదమ్మ మందాత తల్లి దేవాలయం వద్దకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

చారకొండ, మార్చి 31: మండల పరిధిలోని చంద్రాయణపల్లిలో వడ్డెర కులస్థులు ఈదమ్మ మందాత తల్లి కల్యాణోత్సవాన్ని ఆదివారం అంగరంగా వైభవంగా జరుపుకున్నారు. వడ్డెర కులస్తులు ఈదమ్మ మందాత దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి మామిడి తోరణాలతో ఎంతో శోభయమనంగా ఈదమ్మ మాందాత తల్లి దేవాలయాన్ని అలంకరించారు. అనంతరం ఆలయ పురోహితులు మంత్రోచ్చారణాల మధ్య ఈదమ్మ మందాత తల్లి కల్యాణోత్సవాన్ని జరిపించారు. మహిళలు బోనం కుండలను తలపై పెట్టుకొని డప్పువాయిద్యాల నడుమ ఊరేంగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులను తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పిట్ల జంగయ్య, అంజయ్య, కృష్ణయ్య, నర్సింహ, రమేష్, బాలస్వామి, మహిళలు, యువతి యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

వెల్దండ, మార్చి 31 : గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో మైక్రో డొనేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాడని, తిరిగి కేంద్రంలో ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామగ్రామాన చేరవేసి ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని, ఈ మేరకు కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని శేఖర్‌రెడ్డి కోరారు. మండలపార్టీ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు జంగయ్యయాదవ్, బాలస్వామి, రామస్వామి, శశిదర్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, రవి, మట్ట విష్ణు, శ్రీనివాసాచారి, వెంకటయ్య, నరేష్, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

దొంగతనం నెపంతో బాలుడిపై దాడి

అమ్రాబాద్, మార్చి 31: ఓ బాలుడిని దొంగతనం చేశాడనే నెపంతో దాడికి పాల్పడ్డారు. పదర మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు రూ. 70 వేల నగదు ను తీసుకొని పోయాడనే నెపంతో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఆదివారం తెలిపిన వివరాల్లోకి వెళ్లితే.. బాలుడిపై దాడి జరిగిన సంఘటన రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని స్థానికుల ద్వారా తెలిసింది. అదే గ్రామానికి చెందిన మరొక బాలుడు ఈ దొంగతనంలో ఉన్నాడని అనుమానించి అతనిపై ఒత్తిడి పెంచారు. తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ దొంగతనంలో సదరు బాలుడి పాత్ర ఉందని సమాచారం ఇవ్వడంతో పట్టుకుని సంబంధిత వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని వెల్లడించడానికి గ్రామస్థులు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. ఈ సంఘటనపై పదర ఎస్ఐ రాజును వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



పెనిమిళ్లలో బోనాలతో మహిళలు

ఉప్పునుంతల, మార్చి 31 : యాదవుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాల పండుగ ఆదివారం మండల పరిధిలోని పెనిమిళ్ల, పిర్యాటోనిపల్లి గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాదవులు ఉదయం నుంచే భక్తిశ్రద్ధలతో మహిళలు ఉపవాసాలతో ఉంటూ పసుపు కుంకుమ పూలతో పాటు వేప ఆకులతో అలంకరించిన కొత్త బోనం కుండలలో ప్రత్యేకంగా వండిన నైవేద్యం పెట్టుకొని గ్రామంలో డప్పు చప్పుల మధ్య మహిళలు ఊరేగింపుగా పెద్దమ్మ అమ్మవారి ఆలయం వరకు వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. యాదువుల నాయకులు తోళ్ల కృష్ణయ్య, పెంటయ్య, ఆంజనేయులు, చంద్రయ్య, వెంకట్‌నారాయణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

చారకొండ, మార్చి 31: మండల పరిధిలోని శాంతిగూడెంలో సోమవారం నుంచి అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, భక్తబృందం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేది నుంచి 3 వరకు మూడు రోజులపాటు అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న గణపతి పూజ, పుణ్యావాచనము, పంచగవ్యప్రాసనం, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, దేవత హోమాలు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 2న సుప్రభాతసేవ, మంటప దేవత పూజలు, హోమాలు, మన్యూసూక్తం హోమాలు, ధాన్యాధివాసం, చతుర్విద పారాయణం, 3న ధ్వజ, నవగ్రహ, గ్రామ దేవతల, అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు సభ్యులు తెలిపారు. అదేవిధంగా ఆలయం వద్ద మూడు రోజులపాటు భజన, కోలాటాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల, మార్చి 31 : లింగాల మండల పరిధిలోని కోమటికుంట గ్రామానికి చెందిన సంకి కుర్మయ్య ఆదివారం తెల్లవారుజామున దుందుబీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీసులు బానుప్రకాష్‌రెడ్డితో హోంగార్డు ఉప్పునుంతల మండలంలోని కొట్టబురుజు వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. కుర్మయ్యపై ఎస్సై లెనిన్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

అచ్చంపేట, మార్చి 31: వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెరల అభ్యున్నతికి కృషి చేయాలని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ నియోజకవర్గ అధ్యక్షుడు కుంచం శ్రీశైలం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో 16కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర కులానికి సంబంధించి మరిచిపోవడం చాలా బాధాకరమన్నారు. వడ్డెర కులస్తులంతా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని 119మంది ఎమ్మెల్యే, మంత్రులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు మాగాణి సైదులు, వెంకటేష్, పరుశరాములు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

-కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛంతో సన్మానిస్తున్న జిల్లెల గ్రామ నాయకులు

కల్వకుర్తి, మార్చి 31 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం జిల్లెల మాజీ సర్పంచ్ రాములు ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని గ్రామ నాయకులు ఆదివారం పూల మాల, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఈ నెల 3న జరిగే మల్లన్న కల్యాణోత్సవానికి రావాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ దైవభక్తితో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సైతం చేయూతగా నిలుస్తుందని పేర్కొన్నారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన



విత్తనశుద్ధి చేసే విధానం వివరిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

బిజినేపల్లి, మార్చి 31 : పంటల సాగు చేపట్టే ముందు విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా కలిగే లాభాలపై రైతులకు రావేఫ్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మంగనూర్‌లో ఆదివారం ఉదయం పాలెంలోని వ్యవసాయ కళాశాల ఏజీ బీఎస్సీ విద్యార్థినులు రావేఫ్ ప్రోగ్రాంలో భాగంగా రైతులకు విత్తనశుద్ధి తయారీ విధానాని ప్రత్యేక్షంగా చేసి అవగాహన కల్పించి మాట్లాడారు. విత్తనశుద్ధి పంట రకాన్ని బట్టి మారిపోతుందన్నారు. ఒక్కో పంటకు ఒక రకమైన రసాయనాల వినియోగం ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వేరుశనగ సాగు చేపట్టడం వల్ల వేరుశనగ విత్తనశుద్ధి ఎలా చేసుకోవాలో తెలియజేశారు. విత్తనశుద్ధి చేసిన తర్వాత విత్తనాలను విత్తుకోవడం ద్వారా నేలలో ఉండే హానికర సూక్ష్మజీవులు మొక్కల వేర్లకు వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని వివరించారు. రావేఫ్ విద్యార్థినులు ప్రణయ, వైష్ణవి, నివేదిత, వైష్ణవి రెడ్డి, నిహారిక తదితరులు ఉన్నారు.

ఉగాది పురస్కారాలు అందుకున్న కొల్లాపూర్ కళాకారులు



ఉగాది పురస్కారాలు అందుకున్న కళాకారుడు జీకే.వెంకటేశ్

కొల్లాపూర్, మార్చి 31 : చిన్నచింతకుంట మండలం కురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ సంస్థల ద్వారా ఉగాది సాహితీ సాంస్కృతిక ఉత్తమ సేవా రంగంలో అవార్డుల ప్రదానోత్సవంలో కొల్లాపూర్ రంగ స్థల కళాకారులు ఉగాది పురస్కారాలు అందుకున్నారు. కొల్లాపూర్ పట్టణానికి చెందిన రంగ స్థల కళాకారుడు, ఫార్మాసిస్టు జీకే వెంకటేశ్, ఉపాధ్యాయులు ఆమని కృష్ణలను ఉగాది పురస్కారాలకు ఎంపిక చేశారు. గత 20సంవత్సరాల నుంచి కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న వీరిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేయడం పట్ల కొల్లాపూర్ నియోజకవర్గ కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. అవార్డులకు ఎంపికైన కళాకారులు జీకే వెంకటేశ్, ఆమని కృష్ణలు కళారంగానికి సేవ చేసే అదృష్టం తమకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

బిజినేపల్లి, మార్చి 31 : మండలంలోని గంగారంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసి ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు గుండ్లపల్లి హరీశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్లు ఉదయకుమార్, కందూరి శ్రావణిలచే ఆదివారం వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్న చిన్నారులకు, మహిళలకు వైద్య పరీక్షలు చేయించి మందులను అందజేశారు. ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు అవగాహన లేకపోవడం ద్వారా నాటు వైద్యం, స్వంత వైద్యంతో మరింత అనారోగ్యాలకు గురవుతున్నారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్య సేవలతో పాటు మందులు అందజేశామన్నారు. వైద్య సిబ్బంది శివ, మధు, సమీన్, జంగిటి శ్రావణి తదితరులు ఉన్నారు.

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, మార్చి 31 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం వేలాదిమంది భక్తులు మైసమ్మను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్, మార్చి 31 : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుందని అచ్చంపేట పట్టణ ఎస్ఐ శివయ్య ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణానికి చెందిన బుద్దుల సాలయ్య(32) అచ్చంపేట పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో భార్య కొడుకుతో జీవిస్తున్నాడు. శనివారం భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరిగి బుద్దుల సాలయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతని తల్లి బుద్దుల పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు వివేక్‌లు ఉన్నారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బి.దాస్



కొల్లాపూర్, మార్చి 31 : బహుజన సమాజ్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగా కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన బి.దాస్‌ను నియమిస్తూ బీఎస్పీ రాష్ట్ర నాయకత్వం ప్రకటన విడుదల చేసింది. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా, పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జిగా దాస్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచన విధానాన్ని వారి జీవిత ఆశయాలకనుగుణంగా విద్యార్థుల సమస్యలపై బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి వారికి అండగా నిలుస్తానని దాస్ పేర్కొన్నారు. ఎన్నిక పట్ల కుడికిళ్ల గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

'నేడు బీఎల్ఏల సమావేశాన్ని విజయవంతం చేయండి'

కల్వకుర్తి, మార్చి 31 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సోమవారం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్బంగి ఆనంద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేటలోని ఏసీఆర్ గార్డెన్‌లో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ సమావేశానికి ఏఐసీసీ కో ఆర్డినేటర్ కొప్పుల రాజు, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థులు

మన్ననూర్, మార్చి 31: ఆదివారం వెలువడిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో నల్లమల ప్రాంతానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు ప్రతిభ చాటారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన విస్లావత్ అపూర్వ, వటవర్లపల్లి గ్రామానికి చెందిన కేతావత్ స్నేహితలు ఇటీవల జరిగిన ఆరో తరగతి నవోదయ పరీక్ష రాశారు. ఆదివారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో అపూర్వ, స్నేహితలు ఎంపికయ్యారు. వచ్చే విద్యాసంవత్సరం వట్టెం నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం పొందనున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన విద్యార్థులు నవోదయ పాఠశాలల్లో సీట్లు సాధించడంపై ఆయా గ్రామాల గిరిజన సంఘాల నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

ఎక్సైజ్‌శాఖ దాడులు నాలుగు కేసులు నమోదు

ఉప్పునుంతల, మార్చి 31 : ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గాయత్రి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని దేవదారికుంటతండా, కట్టబండతండాలలో తెలకపల్లి ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 1200 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. అదే విధంగా 24 లీటర్లు సారా, 20 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కేసులు నమోదు చేశారు. ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు తెలకపల్లి ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, డీటీఎఫ్ సీఐ కళ్యాణ్, కల్వకుర్తి సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు అరుణ, సృజన్ సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

వంగూరు, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ గెలుపుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని అచ్చంపేట అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే వంగూరు మండలంలో అభివృద్ధి పనులకు గాను రూ. 80 కోట్లకు పైగా నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 13 నుంచి 15 స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

చారకొండ, మార్చి 31: ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, నాయకులు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సహకరించాలని కోరారు.

ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేస్తామని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ప్రలోభపెట్టే విధంగా ప్రభావితం చేసే పోస్టులు రెచ్చగొట్టే విధంగా పెడితే చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.